క్లుప్తంగా

వైభవంగా రాజరాజేశ్వరి అమ్మవారి సంబరాలు



ఊరేగింపుగా వెళ్తున్న అమ్మవారి దాసుడుతోపాటు గ్రామస్తులు

కొత్తూరు: మండల కేంద్రంలో రాజరాజేశ్వరి (రాజ్యలక్ష్మి) సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా సంబరాలు నిర్వహిస్తున్నారు. చివర రోజు రాజరాజేశ్వరి అమ్మవారిని కొలుస్తున్న కొమనాపల్లి లక్ష్మి కుటుంబ సభ్యులు, దాసుడు, గ్రామస్తులు ముగ్రాటలతోపాటు దైవమమ్మ చెట్టు వరకు ఊరేగింపుగా బయలు దేరారు. చెట్టు వద్ద మొక్కలు చెల్లించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సత్సంగం నిర్వహిస్తున్న ప్రవచనకర్తలు

సారవకోట: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కవిటికి చెందిన ప్రవచన కర్త దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరగాలని, హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. చదువు ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని జ్ఞానంతో దేవుడిని చేరుకోవచ్చునన్నారు. సనపల కరుణాకర్, సోమేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. మెండ సన్యాసిరావు, జాడ మోహన్‌రావు పాల్గొన్నారు.

సీతారాములకు లక్ష పసుపు కొమ్ములతో పూజలు



పసుపు కొమ్ములతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక గీతా మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములకు లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు సూరిబాబు, మరపాక శ్రీధర్ శర్మలు భక్తులతో పూజలు చేయించారు.

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



శ్రీనివాసరావు

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వల్ల రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధర లభించిందని పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలియజేశారు. రైతులు పండించిన వరి పంట దళారుల బారిన పడకుండా నేరుగా ధాన్యం కొనుగోలు చేసేందుకు గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి తగిన ధరను కల్పించారన్నారు. మండలంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ ఏడాది 17461 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సేకరించేందుకు లక్ష్యంగా ఉండగా.. ఇప్పటి వరకు 17119 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో రబీ సాగులో వరిపంటను 342 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి లక్ష్యం ఉందన్నారు. గ్రామాల్లోని రైతులు ధాన్యం అమ్మకాలు చేయాలంటే నేరుగా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక రవీంద్ర భారతి స్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం స్కూల్ యాజమాన్యం ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద గీతాలకు, సినీ గీతాలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ వాసు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకుని, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేసిన దాతలకు జ్ఞాపికలను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

- స్వచ్ఛందంగా 58 మంది రక్తదానం

కొత్తూరు: రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపడండి అంటూ భగత్ సింగ్ ట్రస్టు ప్రతినిధి ఎస్.జగదీశ్వరరావు, వైద్యాధికారి దినేష్ యువతకు పిలుపునిచ్చారు. కొత్తూరు కేంద్రంగా సేవలు అందిస్తున్న ఈ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామమైన మాతలకు ఆనుకుని ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన హడ్డుబంగిలో మెగా రక్తదానం శిబిరాన్ని ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేశారు. జెమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 58 మంది రక్తదానం చేశారు. ట్రస్టు సభ్యులు పక్క రాష్ట్రంలో కూడా సేవలు అందించడంతో వైద్యాధికారి వారిని అభినందించారు. ఇటువంటి సేవలు మరెన్నో చేయాలని ట్రస్టు సభ్యులను కోరారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని, అపోహలు తొలగేలా వైద్యాధికారి దినేష్ అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు (ఆరు నెలలకు ఒకసారి) రక్తదానం చేయవచ్చన్నారు. భగత్ సింగ్ ట్రస్టు ద్వారా ఇంతవరకు ఐదుసార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి దినేష్ కూడా రక్తదానం చేశారు.

శిష్టకరణ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన శిష్టకరణ కార్యవర్గం

హిరమండలం: శిష్టకరణ సంఘం హిరమండలం మండలం నూతన కార్యవర్గాన్ని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్.గోవింద్ పట్నాయక్, ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం శిష్టకరణ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఎ.సురేష్, ఉపాధ్యక్షులుగా కె.సంజీవ రావు, ఎస్.రామశంకర్, ప్రధాన కార్యదర్శిగా కె.గణేష్, సహాయ కార్యదర్శులుగా బి.రామకృష్ణ, యు.జయకృష్ణ, కో ఆర్డినేటర్‌గా యు.రాజేష్, కోశాధికారిగా కె.వంశీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా సునీల్ పట్నాయక్, సి.హెచ్.సాయి, లీగల్ అడ్వజర్‌గా ఆనందరావు, వీరితోపాటు పలువురు సభ్యులను ఎనున్నకున్నారు. కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉంటూ సంఘం బలోపేతానికి కృషిచేస్తామన్నారు. వచ్చేనెల 16న సంఘ సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించి భవిష్యత్ ప్రణాళికలపై చర్చిస్తామన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

పొందూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని యురేకా కిడ్స్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. బురిడికంచరాం గ్రామంలో ఏబీడీ ఇండియా ఆధ్వర్యంలో యురేకా విలేజ్ లైబ్రరీ మేళా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులకు యురేకా వారి ప్రతిభ సర్టిఫికెట్లు, స్టేషనరీ అందించారు. వేణుగోపాలరావు, ఉషారాణి, జి.ఎ.నాయుడు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



2కె రన్‌ను ప్రారంభిస్తున్న సూరిబాబు, తదితరులు

నరసన్నపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కళింగ కోమట్ల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆకాంక్షించారు. నరసన్నపేట శర్వాణీ విద్యాలయంలో స్పోర్ట్ మీట్ కార్యక్రమం సందర్భంగా ఆదివారం 2కె రన్ నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రీడా కోటాలో ఉద్యోగాలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ కె.వెంకట ఉజ్వల్, విశ్రాంత డీఈఓ మల్లేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్‌కు పలువురు క్రీడాకారులను (విద్యార్థులను) సత్కరించారు. విద్యా సంస్థల ప్రతినిధులు ఆంజనేయులు, రేఖ, డైరెక్టర్ ఎస్.సాయిరాణి, ప్రిన్సిపాల్ బి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



వెలుగు కార్యాలయం వద్ద పనిచేయని మరుగుదొడ్డి

నరుబుజ్జిలి: ప్రభుత్వ కార్యాలయాల వద్ద గల మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పశువైద్యశాల, వెలుగు కార్యాలయం వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల లోపలికి వెళ్లాలంటే ఊపిరిబిగపట్టాల్సి వస్తుంది. తహసీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్డి ఉన్నప్పటికీ ఎల్లప్పుడు తాళాలు వేసి ఉండడం గమనించదగ్గ విషయం. ట్రాన్స్‌కో, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, హౌసింగ్ కార్యాలయాలకు పూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేయలేదు. దీనివల్ల అనేక పనులపై మండల కార్యాలయాలకు వస్తున్న ప్రజలు మరుగుదొడ్లు లేక అత్యవసర పరిస్థితుల్లో ఇక్కట్లు పడుతున్నారు. మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

900 మందికి వైద్య సేవలు



పాతపట్నం: వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



ఆమదాలవలస రూరల్:రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు సురేష్

పాతపట్నం: పాతపట్నం, ఆమదాలవలస మండాలాల్లో రెండుచోట్ల నిర్వహించిన వైద్య శిబిరాల్లో 900 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాతపట్నం మండల కేంద్రంలోని అంతరాబ కూడలి వద్ద పారిశ్రామికవేత్త సిరిపురం తేజేశ్వర రావు, శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 600 మందిని వైద్యులు దానేటి శ్రీధర్‌తోపాటు వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పాతపట్నం, అచ్యుతాపురం, సరాలి, చంగుడి, అంతరాబ, పరిసర ప్రాంతాలకు చెందిన రోగులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

బొబ్బిలిపేటలో

ఆమదాలవలస రూరల్: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని వైద్యుడు బొడ్డేపల్లి సురేష్ సూచించారు. మండలంలో బొబ్బిలిపేట గ్రామంలో శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో సుమారు 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి పాటిస్తే ఆరోగ్య సమస్యలు రాకుండా నివారించవచ్చునని తెలియజేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎక్కువగా మంచినీరు, కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు వంటి వాటిని తీసుకోవాలన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో వేసవి దృష్ట్యా ప్రజలు మంచి నీటికి ఇబ్బంది పడకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. స్థానిక గాంధీ బజారు ఎదురుగా ఉన్న మంచి నీటి పైప్‌లైన్ లీక్ అయి నీరు వృథాగా పోవడంతో వెంటనే స్పందించి ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. పట్టణంలో ఎక్కడైనా పైప్‌లైన్‌లు లీక్ అయితే వెంటనే పంచాయతీ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు.

పాలవలసలో పారిశుద్ధ్య పనులు



పాలవలసలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామంలో డీసీఎంఎస్ చైర్మన్ జల్లు బలరాం నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అకాల వర్షాలు పడుతున్నందున గ్రామంలో అంటు రోగాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాలువలను శుభ్రం చేయించారు. రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి సుదూర ప్రాంతాలకు తరలించారు.

నీలమణిదుర్గ ఉత్సవాలకు కమిటీల నియామకం



ఉత్సవాలపై చర్చిస్తున్న గ్రామపెద్దలు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు మే 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఆదివారం సాయంత్రం గ్రామపెద్దల సమక్షంలో కమిటీల నియామకం చేపట్టారు. అమ్మవారి ఉత్సవాల్లో ప్రధాన వీధులతోపాటు చిన్నవీధులను కలుపుతూ కమిటీల నియామకాలు చేపట్టినట్లు గ్రామ పెద్దలు నిర్ణయించారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: స్థానిక మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఎస్.కృష్ణవేణి ఆదివారం తెలిపారు. 6వ తరగతికి సంబంధించి 40 సీట్లు, ఇంటర్మీడియెట్ (బైపీసీ) 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే స్థానిక కేజీబీవీలో సంప్రదించాలన్నారు.

29న చింతాడ సంత ఆశీల వేలం

ఆమదాలవలస: మున్సిపాల్టీ పరిధి చింతాడ సమీపంలో ఉన్న వారపుసంత ఆశీల వేలంపాటను ఈ నెల 29న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిషనర్ కె.అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 4 గంటలకు ఆసక్తి ఉన్న పాటదారులు నిబంధనలను అనుసరించి పాటలో పాల్గొనాలని కోరారు.

నేడు మండల సమావేశం

నరసన్నపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బి.మధుసూదనరావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అధికారులందరూ పూర్తి సమాచారంతో రావాలన్నారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

- వంశధార నిర్వాసితులకు అండగా నిలిచిన సీఎం జగన్
- మూడు మండలాలకు వంశధార తాగునీరు
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: దశాబ్దాల కాలంగా వెనుకబడిన పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిపై ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పలు అంశాలపై పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు ఎంతో అవసరమని వివరించారు. సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లాకు వెళ్లిపోయిందని, ఎక్కువగా గిరిజన ప్రాంతం ఉన్న మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. వంశధార నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చామని చెప్పిన టీడీపీ నాయకులు కమీషన్ల పేరుతో పక్కదారి పట్టించారని, బినామీ పేర్లతో స్వాహా చేశారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత నిర్వాసితులకు అదనపు ప్యాకేజీ కోసం రూ.216 కోట్లు విడుదల చేశారన్నారు. రూ.750 కోట్లు ఖర్చుతో ఉద్దానానికి తాగునీటి కోసం చేపట్టిన ప్రాజెక్టు పనుల్లో భాగంగా మెళియాపుట్టి, హిరమండలం, పాతపట్నం మండలాలకు తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు అనుసంధానంగా కేటాయించారని వివరించారు. కొరసావడ, కాగువాడ గ్రామాల వద్ద మహేంద్రతనయ నదిపై బ్రిడ్జి నిర్మాణం కోసం చొరవ తీసుకున్నారన్నారు. ఈ బ్రిడ్జి పనులు ప్రస్తుతం 60 శాతం పూర్తయ్యాయన్నారు. నియోజకవర్గంలో 11 చోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ అవసరమని గుర్తించి పనులు చేపట్టారన్నారు. ఈ పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు వేగవంతం చేయాలన్నారు. కల్లట, జిల్లేడుపేట గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి అంబటి రాంబాబు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న పిరియా విజయ, కృపారాణి

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట గ్రామంలో గల అభయాంజనేయ, పంచముఖ గణపతి, షిర్డీసాయి బాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహించిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయని తురకపేట సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చివరి రోజు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ కిలారి త్రినాథులు పాల్గొన్నారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తుల కోసం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

నేడు కంటి వైద్య శిబిరం

నరసన్నపేట: స్థానిక చిత్తిరివీధి వద్ద సాయి మందిరంలో సోమవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని కంటి రోగులు వినియోగించుకోవాలని సాయి మందిరం కన్వీనర్ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. రోగులు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఫోన్ నంబర్ పట్టుకుని రావాలన్నారు. కంటి శుక్లాలు ఉన్న రోగులకు వెంటనే ఆపరేషన్‌కు తరిస్తామన్నారు.

నువ్వు పంటకు నష్టం



కొత్తూరులో దెబ్బతిన్న నువ్వు పంట

కొత్తూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కొత్తూరు, నివగాం, ఆకులతంపర, కర్లెమ్మ, మెట్టూరు, గరండితోపాటు పలు గ్రామాల్లో సాగు చేస్తున్న సుమారు మూడు వేల ఎకరాల్లో నువ్వు పంట పాడైంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే నువ్వు పంట పాడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీలో ప్రధాన పంటగా నువ్వు పంటను సాగు చేస్తున్నారు.

అధ్వానంగా బస్‌షెల్టర్



బస్‌షెల్టర్‌లో పడిఉన్న చెత్త

ఆమదాలవలస రూరల్: మండలంలో గాజులకొల్లివలస జంక్షన్‌లోని అలికాం–బత్తిలి ఏబీ రోడ్డు వద్ద బస్‌షెల్టర్ అధ్వానంగా మారి చెత్తతో దర్శనమిస్తుంది. ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మించిన బస్‌షెల్టర్‌లో మద్యం సీసాలను, ఇతర వ్యర్థాలను పడివేయడంతో అధ్వానంగా తయారైంది. ఈ బస్‌షెల్టర్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్‌షెల్టర్‌ను పంచాయతీస్థాయి అధికారులు పరిశుభ్రం చేయించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్రపుడెక్క తొలగించాలి



మూలసవళాపురం సమీపంలో గుర్రపుడెక్కతో నిండిన కాలువ

నరుబుజ్జిలి: ప్రస్తుత రబీ సీజన్, రానున్న ఖరీఫ్ సీజన్‌లకు సాగునీరు అందించే దిశగా అధికారులు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలో వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు 12 పిల్ల కాలువల కింద సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందించాలి. ఏళ్ల తరబడి కాలువ పనులు చేయకపోవడం వల్ల శివారు భూములకు చుక్కనీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు.

ఈ కాలువ కింద అపరాలు సాగుకు కూడా నీటి కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. వెంటనే గుర్రపుడెక్క తొలగించాలని కోరుతున్నారు.